క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ విద్య



విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వీరేష్, అధ్యాపకులు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ కళాశాలల్లోనే అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యత విద్యా బోధన అందుతోందని, తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత

విడపనకల్లు:ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హంచనహాల్ గ్రామంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. కార్య క్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు దోణప్ప, లక్ష్మీదేవి, సర్వజ్ఞ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ పోస్టర్లు విడుదల

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చందు, మండల అధ్యక్షుడు హరూన్ రషీద్ కాకినాడలో ఈనెల 8,9,10 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతుల పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. చందు, హరూన్‌రషీద్‌లు మాట్లాడుతూ విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులను విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఉరవకొండలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు.

గుర్రాల సేవలు అమూల్యం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ఉపాధ్యాయుడు గుర్రాల ఓబులేసు సేవలు అమూల్యమని పలువురు కొనియాడారు. సోమవారం మండల కేంద్రంలోని కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రాల ఓబుళేసు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రాల ఓబుళేసు అనేక మంది విద్యార్థులకు చక్కని విద్యను అందించారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, హెచ్‌ఎంలు స్వర్ణలత, నాగేంద్రప్ప,సర్పంచు మోనాలిసా,ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



పీహెచ్‌సీలో మొక్క నాటిన మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి

కూడేరు: పర్యావరణ పరిరక్షణతోనే జీవరాసుల మనుగడ సాధ్యమని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి అన్నారు. సోమవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆవరణలో వైద్య సిబ్బంది సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, సీనియన్ అసిస్టెంట్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని ఏపీఓ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమం శ్రీకారం చుట్టారు. గోవిందవాడ క్రాస్ నుంచి గ్రామం వరకు 400 మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

ఆలయ హుండీకానుకల లెక్కింపు

విడపనకల్లు: మండల పరిధిలోని ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం ఎగ్జిక్యూటివ్ అధికారి రమేష్ బాబు ఆధ్వర్యంలో హుండీకానుకలను లెక్కించారు. ఎనిమిది నెలల్లో వీరభద్రస్వామికి భక్తులు సమర్పించిన కానుకలు రూ.9.77,500 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. దేవదాయశాఖ అధికారి అక్కిరెడ్డి, ఆలయ సిబ్బంది లీలావతి, పురుషోత్తం, మంజునాథ్, సాయినాథ్, పరమేష్, వీరభద్రస్వామి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కంబదూరు:ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తహసీల్దార్ నిత్యానందబాబు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.

విజృంభిస్తున్న డయేరియా

- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రులు
- కణేకల్లు మండలం అంబాపురంలో ఒకరు మృతి

రాయదుర్గం: నియోజకవర్గంలోని రాయదుర్గం, గుమ్మఘట్ట, డీ హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో డయేరియా విజృభిస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు వ్యాధి తీవ్రతను తట్టుకోలేక వణికిపోతున్నారు. రోజూ ఏదో ఒక గ్రామంలో డయేరియా కేసులు వెలుగుచూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఓవైపు సీజనల్ వ్యాధులు..మరోవైపు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న వారితో ప్రభుత్వాస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

రాయదుర్గం మండలం నాగిరెడ్డిపల్లిలో డయేరియా సోకి సుమారు 25 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. కళ్యాణదుర్గం ఆర్డీటీ, అనంతపురం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. తాజాగా తమ్మేపల్లి, గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం, గొల్లపల్లి, డి హీరేహాళ్ మండలం మురడి తదితర గ్రామాల్లో జీ కేసులు నమోదయ్యాయి. వీరంతా రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల కణేకల్లు మండలం అంబాపురంలో బోయ వంద్రప్ప అనే వృద్ధుడు డయేరియాతో మృతిచెందాడు. గ్రామంలో మరింత మందికి ఈ వ్యాధి లక్షణాలు కనిపించడంతో స్థానికులు భయంభ్రాంతులకు గురవుతున్నారు.

పెరుగుతున్న ఓపీ, ఐపీ కేసులు

సీజనల్ వ్యాధులు రోజురోజుకూ విజృంభిస్తుండడంతో రాయదుర్గం ఏరియా ఆస్పత్రితో పాటు కణేకల్లు సీహెచ్‌సీ, ఆయా మండలాల్లోని పీహెచ్‌సీలన్నీ రోగులతో కిటకిట లాడుతున్నాయి. ఏరియా ఆస్పత్రిలో రోజు 450 నుంచి 600 మధ్య ఓపీ నమోదు కాగా, ఇందులో ఎక్కువ శాతం మంది జ్వరాలు, వాంతులు, విరోచనాలతో వస్తున్నారు. ఇక్కడ ఓపీతో పాటు ఐపీ కేసులు కూడా పెరుగుతున్నాయి. సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లోనూ జీ కేసులే అధికంగా నమోదవుతున్నాయి.

అపరిశుభ్రతా.. తాగునీరు కలుషితమా..?

డయేరియా ప్రబలడానికి గల కారణాలను అధికారులు గుర్తించలేక పోతున్నారు. కేసులు నమోదైన గ్రామాల్లో మాత్రం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, చేతులు దులిపేసుకుంటున్నారు. ఇలా కాకుండా పారిశుద్ధ్యలోపమా? లేక తాగునీరు కలుషితమా..? అన్న దాన్ని గుర్తిస్తే బాగుంటుందని ప్రజలు వాపోతున్నారు. పల్లెల్లో తాగునీటి ట్యాంకులు శుభ్రతంతో పాటు క్లోరేనేషన్ నీరు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

డయేరియా లక్షణాలు - పాటించాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- కలుషిత నీరు, ఆహారం ద్వారా డయేరియా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తికి వాంతులు, విరోచనాలు అధికంగా అవుతాయి.
- కడుపునొప్పి, దాహం, చర్మం ముడతలు పడడం, నోరు ఎండిపోవడం, మూత్ర విసర్జన తగ్గుతుంది.
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- క్లోరిన్ కలిపిన నీటిని కాచి చల్లార్చి తాగాలి.
- భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.



రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహబూబ్‌సాబ్, మురడి, డి హీరేహాళ్ మండలం



రామిరెడ్డి, గొల్లపల్లి, గుమ్మఘట్ట మండలం



పెద్ద కృష్ణానాయక్, 75 వీరాపురం గుమ్మఘట్ట మండలం

కేసులు పెరుగుతున్నాయి



గత కొద్ది రోజుల నుంచి ఓపీలో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. తీవ్రతను బట్టి అడ్మిట్ చేసి చికిత్సలు అందిస్తున్నాం. కావాల్సినన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ కొన్నాళ్లు సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. డయేరియా లక్షణాలు కలిగిన వారు ఓఆర్ఎస్ లేదా ఉప్పువేసిన గంజినీళ్లు, మజ్జిగ, బార్లీనీళ్లు, కొబ్బరి నీళ్లు తీసుకోవడం మంచిది. నిర్లక్ష్యం చేస్తేనే ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే చాలు సమీప ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాలి. ఎక్కువ శాతం పల్లెల నుండే కేసులు వస్తున్నాయి.

– డాక్టర్ మాధవి, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం

వైఎస్సార్‌సీపీ నాయకురాలు మృతి



చక్కమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాయదుర్గం జెడ్పీటీసీ మల్లికార్జున

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు బోయ చక్కమ్మ (79) మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలు కావడంతో చక్కమ్మ మనోవేదనకు గురైంది.తరచూ ఎన్నికల ఫలితాలపై చర్చిస్తుండేదని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున, సర్పంచ్ వినూత, ఎంపీటీసీ శ్యామలమ్మ, సీనియర్ నాయకులు ఆర్‌టీ కాంతారెడ్డి తదితరులు చక్కమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతురాలికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నాయకులు హేమారెడ్డి, లక్ష్మీరెడ్డి, స్వామి, మంజు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

7న 'మాదిగల జన జాతర'

కంబదూరు: ఈనెల 7న మాదిగల జనజాతర కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ములకనూరు రామాంజి, నాయకులు రామన్న, అనిల్‌కుమార్, మైలారి, రాజు, తిప్పేస్వామి, హరి, దేవేంద్ర, నరసింహులు, రామ్మోహన్, గంగాధర్, గోపాల్, శివశంకర్, నాగరాజు, దిలీప్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచట్టాలపై అవగాహన

గుమ్మఘట్ట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్తచట్టాలపై ఎస్ఐ వెంకటేశ్వర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. పూలకుంట,74వీరాపురం,గోనబావి, గుమ్మఘట్ట, తాళ్లకెర గ్రామాల్లో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం



ఆస్పత్రిలో వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న వైద్యులు, సిబ్బంది



కణేకల్లులో డాక్టర్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీటీ ఆస్పత్రి వైద్యులు



వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. వైద్యాధికారి మాధవి మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వైద్యులు మెర్సి సుధ, మునవ్వర్‌రాజ్ రాధ, మోహన్‌సాయి, ప్రతిభ, ప్రదీప్తి, నర్సులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కణేకల్లు: ప్రాణపాయస్థితిలో ఆస్పత్రికి వచ్చే వారికి ప్రాణం పోసే గొప్ప వ్యక్తులు డాక్టర్లు అని గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజేష్ పేర్కొన్నారు. సోమవారం కణేకల్లుక్రాస్‌లోని గురుకుల పాఠశాలలో 'నేషనల్ డాక్టర్స్ డే'ను నిర్వహించారు. ఆర్డీటీ ఆస్పత్రి వైద్యులు హాజరై విద్యార్థుల మధ్య 'నేషనల్ డాక్టర్స్ డే' ను నిర్వహించారు. ఆర్డీటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గేష్ మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యక్ష్యంగా సేవ చేసే భాగ్యం ఒక్క డాక్టర్‌కు మాత్రమే లభిస్తోందన్నారు. అనంతరం గురుకుల పాఠశాల సిబ్బంది ఆర్డీటీ డాక్టర్లను సన్మానించారు.

ఉరవకొండ: వైద్యులు దేవుడితో సమానమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంసీ జయకృష్ణ తెలిపారు. సోమవారం డాక్టర్స్‌డేను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. డాక్టర్ ఎల్లోజి, డాక్టర్ నుస్రత్‌జహ (సాక్షి), డాక్టర్ అర్జున్, డాక్టర్ రాజేష్, డాక్టర్ కుముద, డాక్టర్ కల్పన, డాక్టర్ గంగాధర్, డాక్టర్ ఇస్మాయిల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు పీజీఎస్ నూర్‌మహ్మద్, కార్యదర్శి నగేష్‌బాబు, కోశాధికారి జాబీర్, సభ్యులు ఎంసీ నాగభూషణం, గంగాధర్, జీకే శ్రీధర్, రహీంతబి పాల్గొన్నారు.

అవగాహనతోనే అతిసార వ్యాధి కట్టడి



కూడేరు: మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్యారెడ్డి



బొమ్మనహాళ్‌లో డయేరియా నివారణపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

- మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి

కూడేరు: అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలని, ఆ వ్యాధి ప్రబలకుండా అరికట్టొచ్చని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి తెలిపారు. సోమవారం కూడేరులోని ఆరోగ్య ఉప కేంద్రంలో అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, కాచి చల్లార్చిన నీటిని తాగితే అతిసారతో పాటు ఇతర వ్యాధులు రాకుండా నివారించొచ్చని ఆమె తెలిపారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. సర్పంచ్ లలితమ్మ, సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోధ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మహమ్మారి డయేరియాను తరిమికొడదామని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు ఆదిబయమ్మ, జయమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ, ఆయుష్ వైద్యులు రాధాకుమారి, ఏఎన్‌ఎం సువర్ణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చీకలగురికి, పాల్తూరు గ్రామాల్లో సోమవారం డయేరియాపై ఆరోగ్య సిబ్బంది సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ కరణం పుష్పావతి హాజరయ్యారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలపై ర్యాలీ చేశారు.

జాగ్రత్తలు పాటిస్తే డయేరియా దూరం

బొమ్మనహాళ్: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి తెలిపారు. సోమవారం దేవగిరి గ్రామంలో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాధులు ప్రబల కుండా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుళ్లాయినాయుడు, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, కృష్ణ, రుక్మిణీ, అంగన్‌వాడీ కార్యకర్త సుజాతమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోస్టర్లు, ఫ్లెక్సీలు విడుదల

ఉరవకొండ: జూలై 1 నుంచి 31 వరుకు జరిగే ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా స్టాప్ డయేరియా పోస్టర్లు, ఫ్లెక్సీలను రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు సోమవారం విడుదల చేశారు. పీహెచ్‌పీ వైద్యాధికారిణి మనోజ్ఞ మాట్లాడుతూ అతిసారను అరికట్టడానికి స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, పీడీ ఆనంద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతోనే అనర్థాలు

కుందుర్పి: బాల్య వివాహాలు అనర్థాలకు దారితీస్తాయని సీడీపీఓ వనజా అక్కమ్మ అన్నారు. సోమవారం కొలిమిపాళ్యంలోని ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు అరికడదాం- ఆడ పిల్లలను రక్షించుకుందాం' అనే అంశంపై ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు వారి తల్లిదండ్రులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ప్రాజెక్టర్ ద్వారా లఘు చిత్రాలతో వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ తిప్పేస్వామి, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా పింఛన్ పంపిణీ చేయండి

- స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ చౌదరి



కూడేరు మండలం కమ్మూరులో నగదును అందిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ చౌదరి



ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి రూ.43వేల పింఛన్ అందిస్తున్న దృశ్యం

కూడేరు: లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదును అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాణ చౌదరి సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. సోమవారం పింఛన్ నగదు పంపిణీని ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించారు. కమ్మూరు, గొటుకూరు , అరవకూరు, ఇప్పేరు, కూడేరు. కడదరకుంట గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ పర్యటించారు. మండలంలో 5,699 మంది పింఛన్ లబ్ధిదారులుండగా రూ.3.82 కోట్లు నగదు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని పరిధిలో అన్ని గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం సజావుగా జరిగింది. మండలం లోని గొంచిరెడ్డిపల్లి, ఎస్.కొనాపురం గ్రామాల్లో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు హాజరయ్యారు. స్పెషల్ ఆఫీసర్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీఓ దాసానాయక్ , ఈఓఆర్డీ వెంకట్‌నాయుడు , ఏపీఓ అవినాష్, సర్పంచ్‌లు వనిత, సందీప్ పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగింది. సోమవారం ఉదయమే సచివాలయ ఉద్యోగులు టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పెంచిన పింఛన్ సొమ్ము రూ.7 వేలు లబ్ధిదారులకు అందించారు. మండల కేంద్రంలో పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, ఉండబండ, చీకలగురికి,పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్లు తదితర గ్రామాల్లో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. గడేకల్లులో వైఎస్సార్‌సీపీ ఎంపీపీ కరణం పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న 15 గ్రామ సచివాలయాల పరిధిలో 86 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ గౌరిదేవి తెలిపారు.6,238 మంది పింఛన్‌దారులలో 86 శాతం పంపిణీ పూర్తయినట్లు వారు తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో ఎన్‌టీఆర్ పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అధికారి లక్ష్మీనరసయ్య, కళ్యాణదుర్గం ఈఓఆర్డీ బాలాజీ సోమవారం తనిఖీ చేశారు.

వజ్రకరూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఎన్టీర్‌భరోసా ఫించన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగింది. ఎంపీడీఓ విజయలలిత, సర్పంచు మోనాలిసా, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు 90 శాతం పూర్తి చేసిన్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. 19 గ్రామ పంచాయతీల్లో 6,598 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, 5,883 లబ్ధిదారులకు అందించి 90 శాతం పూర్తి చేసిన్నట్లు తెలిపారు.

కుందుర్పి: మండలంలోని జంబుగుంపుల, బెస్తర్లపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 7,646 మంది లబ్ధిదారులకు రూ. 5.26 కోట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.

ఒకే ఇంటికి నాలుగు పింఛన్లు

కళ్యాణదుర్గం:మండలం బోరంపల్లి గ్రామంలో బులిగొండ్ల ఎర్రిస్వామి కుటుంబంలో నలుగురికి రూ.43వేల పింఛన్ సోమవారం అందింది. బులిగొండ్ల ఎర్రిస్వామికి ముగ్గురు కుమార్తెలు. పుట్టుకతోనే ముగ్గురూ శారీరక వైకల్యంతో పుట్టారు. దీంతో గత ప్రభుత్వం నుంచి కూడా నలుగురికీ పింఛన్ అందేది.

ఘనంగా మెట్టు గోవిందరెడ్డి జన్మదిన వేడుకలు



మెట్టుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, పార్టీ నాయకులు

రాయదుర్గం: రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి 73వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మెట్టు గోవిందరెడ్డి నివాసంలో జరిగిన వేడుకలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, పార్టీ నాయకుల మధ్య కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు చూపిన ఆదరాభిమానాలు మరవలేనివన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సమానమేనని, ప్రజా తీర్పుకు కట్టుబడి పనిచేద్దామన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటం సాగిద్దామన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం : డీ హీరేహాళ్ మండలంలోని మురడిలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, దాడులు పెరిగియాని, ఇది సరైన పద్ధతి కాదని మెట్టు అన్నారు. కొందరి మెప్పుకోసం ఎస్ఐ కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై కేసులు బనాయించడం సరికాదన్నారు. సోషల్ మీడియా కోకన్వీనర్‌ను స్టేషన్‌కు పిలిపించుకొని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయనలో మార్పుకనిపించకపోతే జిల్లా ఎస్పీతో పాటు రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

రెండేళ్లలో బీటీపీ పనులు పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం/శెట్టూరు: రానున్న రెండేళ్లలో భైరవానితిప్ప ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్పష్టం చేశారు. కళ్యాణదుర్గం మండలంలోని గోళ్ల గ్రామం, శెట్టూరు మండలం యాటకల్లు, లక్ష్మంపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి బీటీపీకి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారం రూ.100 కోట్లు వెంటనే ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.అనంతరం శెట్టూరు మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ప్రత్యేక అధికారి, ఈఓ లక్ష్మీనరసయ్య పరిశీలించారు. సాయంత్రానికి 89.99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు.

కేవీకేకు జాతీయస్థాయి ప్రశంసాపత్రం

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కేవీకే శాస్త్రవేత్తలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లు కేవీకే శాస్త్రవేత్త రాధాకుమారి సోమవారం తెలిపారు. ఇటీవల కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ రాజమండ్రిలో భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అగ్రికల్చర్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ జోన్ 10 సదస్సులో కళ్యాణదుర్గం చెందిన కృషి విజ్ఞాన కేంద్ర (కేవీకే)కు జాతీయ స్థాయిలో ప్రసంసా పత్రాన్ని ఆటారి డైరెక్టర్ షేక్ మీర చేతుల మీదుగా అందుకున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాంకో ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్‌లో సోమవారం మురళి అనే వ్యక్తి మద్యం మత్తులో పరుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పాలవాయి గ్రామానికి చెందిన మురళి, పావని భార్య భర్తలు. పావనిపై అనుమానంతో తరుచూ గొడవ పడుతుండేవాడు. సోమవారం పావనితో గొడవ పడి కళ్యాణదుర్గానికి వచ్చి తాగిన మైకంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి వెంటనే అతన్ని సీహెచ్‌సీకి తరలించారు.